"దీని పేరేమిటి ?"

"కరట పక్షి" చెప్పాడు దామోదరం.


ముదురు నీలిరంగులో వుంది ఆ పక్షి. మెడదగ్గర కొంచెం ఎర్రగా వున్నది. దాని కళ్ళు మెరుస్తున్నాయి. భయంగా మా వైపు చూస్తూ పంజరంలో అటూ ఇటూ తిరుగుతోంది. చిన్నపక్షి. ముద్దుగా వుంది.

"ఎక్కడ దొరికింది ?" అడిగాను చేత్తో పంజరం మీద కొడుతూ.

ఆ పక్షి వులిక్కిపడి చిన్నగా అరిచింది. దానిఅరుపు అదోలా వున్నది కీచుమంటూ.

# 'కరటపక్షి'

ప్రతాపరవిశంకర్




నాలుగు రోజుల క్రితం ఏలూరు వెళ్ళి ఆ రోజునే తిరిగి వచ్చాను. వచ్చీరాగానే మా ప్రక్క యింట్లో వుండే దామోదరం ఓ పక్షిని తీసుకువచ్చి పంజరంలో బంధించిన విషయం తెలిసింది. వెంటనే వచ్చాను.

ఆ పక్షి ఎక్కడ దొరికిందని నేనడిగిన ప్రశ్నకు "మూడు రోజుల క్రితం నేను— మీ ఆఫీసర్ క్యాంపుకు వెళ్ళి జీపులో తిరిగి వస్తున్నాం. బాగా వేగంగా వెళుతోంది జీపు. ఇంతలోనే ఈ పక్షి రివ్వున ఓ చెట్టు మీద నించి దూసుకువచ్చింది. జీపు అద్దానికి కొట్టుకుని రోడ్డు పక్కన పడిపోయింది. డ్రయివర్‌ని జీపు ఆపమని దిగివెళ్ళి దీన్ని తీసుకువచ్చాను. చూడటంతోనే కరటపక్షి అని గ్రహించాను. ఒక రోజు తర్వాతగానీ ఇది ఆ షాక్‌నించి తేరుకోలేకపోయింది."

అలా చెబుతున్నప్పుడు దామోదరం కళ్ళలో ఏదో మెరుపు కనిపించింది నాకు. అంత దిగులులోనూ అతని ముఖంలో కనిపిస్తున్న తృప్తిని నేను గమనించి ఆశ్చర్యపోయాను.

ఎందుకంటే— వారం రోజుల క్రితం దామోదరం రెండో కొడుకు ఇరవై యేళ్ళవాడు కొంత డబ్బు తీసుకుని ఇంట్లోనించి వెళ్ళిపోయాడు. అతనికోసం దామోదరం ఎంతగానో వెతికాడు. ఎక్కడా కొడుకు ఆచూకీ తెలీలేదు. అందువల్ల అతను చాలా దిగులుగా వున్నాడు.

"ఇంతకీ మీ అబ్బాయిగురించిన ఆచూకీ ఏదయినా తెలిసిందా ?" అని అడిగాను దామోదరాన్ని.

"తెలీలేదు కాని ఓ రెండురోజుల లోపలే వాడు తిరిగొస్తాడు" అన్నాడు దామోదరం గట్టిగా.

"అంత గట్టిగా ఎలా చెప్పగలవు ?" కుతూహలంగా అడిగాను.

నా ప్రశ్నకు జవాబుగా దామోదరం— పంజరంలో తిరుగుతున్న కరటపక్షిని చూపించాడు.

"అంటే ?"

"వివరంగా చెబుతాను. ఈ పక్షి గురించి నీకు ఇంతవరకు చెప్పలేదు. నిజానికి ఈ పక్షిగురించి చాలా తక్కువమందికి తెలుసు. దీనికి మరో పేరు అదృష్టం పక్షి .... నా చిన్నతనంలో ఓ పుస్తకంలో దీన్ని గురించి చదివాను. ఈ పక్షి ఇంట్లో వుంటే ఆ ఇంటికి మేలు జరుగుతుందట. అదృష్టం కలిసి వస్తుందిట.... నా అదృష్టం .... ఇది నాకు దొరికింది. ఈ కరటపక్షులు చాలా రేర్‌గా వుంటాయి. అందుకే ఇది దొరికిన వెంటనే పారిపోవటానికి వీల్లేకుండా పంజరం కొని తెచ్చాను" అన్నాడు దామోదరం నన్ను చూస్తూ.

నిజంగా ఆశ్చర్యం ! ఆ పక్షి ఇంట్లో వుంటే అదృష్టం కలుగుతుందా ?

# సంక్రాంతి చలి



అంతయై యింతయై మరియంత యౌచు
అనుదినంబును పెరిగి బ్రహ్మాండ మెల్ల
వింత వింతగ అల్ల త్రివిక్రము గతి
నాక్రమించెద వెంత ద్రోహంబొ చలిరా

2

మందిరాంతర సీమల మాటువడిన
జీవులను గూడ అలనల్ల చేడుకొందు
దువ్వటుల లోన దూరిన దొరల గూడ
బిట్టు వణకింతువౌరా! నిర్వేదనట్లు.

3

ఆదికాలమునందు నీ యాట సాగె
నిప్పు కలనాళ్ళ చెల్లునే నీ చలమ్ము
ఉష్ణ సాధనములు పెక్కులుదయమయ్యె
ధనిక జనముల మేనులు తాకగలవె?

4

ఎల్లవారల ఋణదాత యెట్లొ యట్లు
ఊహుంహూ యని వణకించు నూహసరియె
మానరంబైన యీ పుష్యమాస రాత్రి
నిన్ను చలిక్రమ్మనేమొ గణించినావె?

5

పుట్టుయోగులవలె నొక్క చెట్టుక్రింద
ఆలుబిడ్డల గూడి దినాలు నెట్టు
బడుగువారల బ్రతుకు నీ పాలబడియె
సంతసింపుము! మనసార చలిరా! పులిరా!

—శనగవ నరసింహస్వామి

నమ్మకం చాలా చిత్రమైనది. అది అనేక విధాలుగా వుంటుంది. వాటిల్లో ఇదో రకమైన నమ్మకం అనిపించింది.

నాకు ఇలాంటి పిచ్చినమ్మకాలు, విశ్వాసాలు లేవు.

"ఏమో! ఈ పక్షి పేరునే ఇంతవరకు విన్లేదు. దీన్ని చూడలేను. ఐనా దీనివల్ల ఏదో మేలు జరుగుతుందని నేను నమ్మటం లేదు" అన్నాను సిగరెట్టు ముట్టిస్తూ.

"నీకు తెలీదు. నేను చెప్పినా తెలీదు. ఐనాదీని మీద నాకు నమ్మకం వుంది నీ అభిప్రాయం సరయినదికాదని త్వరలోనే తెలుసుకుంటావ్."

పంజరంతలుపును గట్టిగానొక్కి దాన్ని బల్లమీద వుంచాడు.

కొంచెంసేపటి తర్వాత దామోదరం కూతురు సునీత రెండు గ్లాసులతో కాఫీ తీసుకొచ్చి నాకో గ్లాసు ఇచ్చింది....

కాఫీ తాగుతూ "మళ్ళీ సంబంధాల వేటలో పడలేదా?" అని అడిగాను....

"....పదాలి. సుపుత్రుడు అచూకీ తెలియకపోవటంవల్ల ఇల్లు కదల్లేకపోయాను" అన్నాడు

ఆ తర్వాత ఓ గంట సేపు దామోదరం ఆ కరటపక్షి అందం గురించీ, దానిగొప్పతనం గురించీ చెప్పాడు.... ఆ పక్షి తనకు దొరకటం తన పూర్వజన్మ పుణ్యం అని కూడా అన్నాడు. నేను అక్కడ వున్నప్పుడే దానికి ఆహారం పెట్టాడు. కాని అది భయంవల్ల తినకుండా పంజరంలో తిరగటం మొదలుపెట్టింది చిన్న ముక్కుని అటూ ఇటూ తిప్పుతూ....

ఒకరోజు గడిచింది.

రెండో రోజు సాయంత్రం దామోదరం కొడుకు ఇంటికి తిరిగివచ్చాడు. డబ్బు అయిపోయిందిట. ఓ ఫ్రెండ్‌తో కలిసి మద్రాసు, మహాబలిపురం తిరిగివచ్చాడుట.

నేను వెళ్ళేసరికి కరటపక్షికి ఆహారం పెడుతున్నాడు దామోదరం.

నాలో వున్న ఆశ్చర్యాన్ని నా కళ్ళలో కనపడనీయకుండా జాగ్రత్తపడ్డాను. ఎందుకంటే దామోదరం చెప్పినట్టుగా రెండ్రోజుల్లోనే అతని కొడుకు తిరిగివచ్చాడు.

"చూశావా.... మావాడు తిరిగివచ్చాడు. అంతా కరటపక్షి అదృష్టం. ఏమంటావ్?" అన్నాడు దామోదరం సంతోషంగా.

కొంచెం భయం తగ్గినట్లుంది. ఆహారాన్ని తింటోంది కరటపక్షి.

"ఐనా నేను నమ్మలేకుండా వున్నాను. ఒకవేళ ఈ కరటపక్షి నీకు దొరక్కుండా వున్నా నీ కొడుకు తిరిగివచ్చేవాడేమో ఈరోజు" అన్నాను కావాలనే.

"ఇందుకు నేను ఒప్పుకోను" అన్నాడు అతను నవ్వుతూ.

ఆ మరురోజు ఉదయమే దామోదరం కూతురి పెళ్ళి సంబంధం గురించి ఓవరు వెళ్ళాడు. ఆ రాత్రికే తిరిగి వచ్చాడు.

ఆ తర్వాత రెండ్రోజులకు పెళ్ళిచూపులు జరిగాయి. దామోదరం కూతురు వాళ్ళందరికీ నచ్చింది. అతను ఇవ్వచూపిన కట్నం కూడా నచ్చింది. ఆ రోజునే ముహూర్తాలు కూడా పెట్టుకున్నారు.

ఈ విషయం తెలిసిన తర్వాత నా భార్య నన్ను సాధించటం మొదలుపెట్టింది. నాకూ పెళ్ళికి ఎదిగిన ఓ కూతురున్నది. దానికీ సంబంధాలు చూస్తున్నాముగానీ ఒక్కటీ ముడిపడలేదు.

పెళ్ళివారు వెళ్ళిపోయిన తర్వాత నాతో అన్నాడు దామోదరం — "ఇప్పటికయినా ఒప్పుకుంటావా? ఇదంతా కరటపక్షి అదృష్టం.... మూడేళ్ళనించీ నా కూతురికి సంబంధాలు చూస్తున్నాము. ఈ కరటపక్షి వచ్చిన తర్వాత ఇప్పటికి కుదిరింది."

నేనేమీ మాట్లాడలేదు.

ఓ ఇరవై రోజుల తర్వాత దామోదరం కూతురు పెళ్ళయి భర్తతో కాపురానికి వెళ్ళిపోయింది..

నా స్నేహితుడి కూతురు పెళ్ళికావడంతో నాలోనూ ఆత్రుత బాగా హెచ్చింది. వెనుక నా భార్య రొద.. తీవ్రమయిన ప్రయత్నాలు చెయ్యటం మొదలుపెట్టాను.

అయినా ఒక్కటీ ఫలించటంలేదు. పెళ్ళిచూపులకు వచ్చిన వాళ్ళందరూ టిఫిన్ చేసి కాఫీ తాగి వెళ్ళిపోతున్నారు. మా అమ్మాయి కొంచెం ఛాయ తక్కువ కావటంవల్ల ఎవరికీ నచ్చటంలేదు.

ఓ రోజు హఠాత్తుగా దామోదరం కొడుకు మళ్ళీ ఇంట్లోనించి కొంత డబ్బు తీసుకుని చెప్పకుండా వెళ్ళిపోయాడని తెలి




సింది నాకు.

మళ్ళీ దామోదరం దిగులుపడిపోయాడు కొడుకు ప్రవర్తన గురించి. మొదటిసారి అలా చెప్పకుండా వెళ్ళినందుకు కొడుక్కి హితబోధ చేశాడు. అయినా అతను మళ్ళీ వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత నాలుగు రోజులకే దామోదరం నన్ను పిలిచి ఓ విచారకరమైన విషయం చెప్పాడు. ఆ రోజునే అతని కూతురు దగ్గర్నుంచి ఉత్తరం వచ్చిందిట. అందులో ఆమె భర్త మంచివాడు కాదనీ. అన్ని దుర్గుణాలూ వున్నాయనీ. రోజూ తాగివచ్చికొడుతున్నాడనీ రాసిందిట. ఈ విషయాన్ని చెప్పి కంటతడిపెట్టాడు దామోదరం. నాక్కూడా బాధనిపించింది. ఆ విషయం వినగానే.

ఆ రాత్రంతా అతను చెప్పిన విషయమే నాకు గుర్తుకు వచ్చింది. దిగులు నిండిన జీవంలేని దామోదరం ముఖమే నా కళ్ళ ముందు కదిలింది.

మరునటి రోజు ఉదయం ఎనిమిదిన్నర అవుతుండగా దామోదర ఇంటికి వెళ్ళాను. నేను వెళ్ళేసరికి అతను కరటపక్షిని పంజరంలోనించి బయటకు తియ్యబోతున్నాడు.

నన్నుచూసి "దీన్ని వదిలిపెడుతున్నాను" అన్నాడు దాన్ని బయటకు తీసి పట్టుకుని.

"ఎందుకు వదిలెయ్యడం?" అని అడిగాను ఆశ్చర్యంగా.

"ఇంకెందుకీ పక్షి? ఇది నా కొడుకు మనసుమార్చి ఇంట్లోనించి వెళ్ళకుండా చెయ్యగలిగిందా? పెళ్ళయిన నాకూతురి జీవితాన్ని సుఖమయం చెయ్యగలిగిందా? అనుకోవటమేగానీ ఎదుటి మనుషుల ఆలోచనలను. ప్రవర్తనలను మార్చటం మనకే సాధ్యం అవకపోతుంటే ఈ పక్షులేం చెయ్యగలవు?అంతా మన భ్రమ-అజ్ఞానం" అని చేతిలోవున్న పక్షిని వదిలేశాడు దామోదరం.

రెక్కలు టపటప లాడిస్తూ ఒక్కసారున బయటకు పరుగుదీసింది ఆ కరట పక్షి.

